# గాంధీ స్టాంపులు, కరెన్సీ సేకరణలో దిట్ట



వివిధ దేశాల నుంచి సేకరించిన గాంధీ నాణేలు



వివిధ దేశాల నుంచి సేకరించిన స్టాంపులు

**తిరువళ్లూరు, న్యూస్‌లైన్:**

గాంధీ అంటే ఆయనకు ఎనలేని ఇష్టం. గాంధీ పేరుతో విడుదలైన స్టాంపులు, నాణేలు, కరెన్సీని దేశదేశాల నుంచి సేకరిస్తున్నాడు. ఇలా సేకరించిన వాటితో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నాడు. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి ప్రాంతానికి చెందిన రాజేష్(31) ప్రస్తుతం హిందూస్థాన్ పెట్రోలియం కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతని తండ్రి లోకనాథన్ వ్యాపారి కాగా, తల్లి లక్ష్మీదేవి గృహిణి. గుమ్మిడిపూండి సమీపంలో ప్రాథమిక విద్యను అభ్యసించాడు. రాజేష్ ఆరో ఏట నుంచే గాంధీజీకి సంబంధించిన స్టాంపులు, కరెన్సీ, నాణేలను సేకరించడం ప్రారంభించాడు. పాఠశాలలో చదువుతున్న సమయంలో స్నేహితులు తమకు ఇష్టమైన సినీహీరోలు, హీరోయిన్‌ల చిత్రాలను సేకరించి నోటుబుక్‌లలో భద్రపరిచేవారు. ఆ ప్రభావంతో రాజేష్ దేశానికి ఎంతో సేవ చేసిన గాంధీ బొమ్మలను సేకరించడం మొదలుపెట్టాడు. ఇతడు సేకరించిన వాటిలో గాంధీజీ బొమ్మలు, చిత్రాలు, కరెన్సీ, స్టాంపులు, స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నప్పటి ఫొటోలు, గాంధీజీ బాల్యానికి సంబంధించిన ఫొటోలు, దక్షిణాఫ్రికాలో ఆయనకు జరిగిన అన్యాయం, నల్ల జాతులకు జరిగిన అన్యాయం తదితర చిత్రాలు ఉన్నాయి. తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీ దగ్గరి నుంచి ఉద్యోగంలో చేరిన తరువాత వచ్చే వేతనంలో సగభాగాన్ని స్టాంపులు, నాణెముల సేకరణ కోసమే రాజేష్ వెచ్చిస్తున్నాడు. గాంధీజీపై ఉన్న మక్కువతో విదేశాల నుంచి కూడా స్టాంపులు సేకరించడం ప్రారంభించాడు. అమెరికాతో పాటు బాంగ్లాదేశ్, శ్రీలంక, ఇరాన్, దక్షిణాఫ్రికా, జర్మనీ, ఇంగ్లండ్ తదితర దేశాల నుంచి గాంధీ స్టాంపులను సేకరిస్తున్నాడు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రభుత్వం 1948లో మొట్టమొదటిసారిగా గాంధీజీపై స్టాంపులను విడుదల చేసింది.

ఈ స్టాంపులను 1987వ సంవత్సరంలో 12 వేల రూపాయలతో కొనుగోలు చేశాడు. ఉద్యోగంలో చేరిన తర్వాత సగం జీతాన్ని స్టాంపులు కొనుగోలుకే వెచ్చించేవాడు. బ్యాంకుల ద్వారా రుణాలు పొంది మరీ స్టాంపుల సేకరణ జరుపుతున్నాడు. ప్రస్తుతం అతని ఇంటి నిండా గాంధీజీ స్టాంపులే దర్శనమిస్తున్నాయి. తల్లిదండ్రులు పోత్సాహంతో 28 సంవత్సరాలుగా రాజేష్ స్టాంపుల సేకరణ కొనసాగిస్తున్నాడు. ఇప్పటి వరకు 42 సార్లు భారత ప్రభుత్వం తపాల బిల్లలు, స్టాంపులను విడుదల చేయగా అన్నింటినీ సేకరించి భద్రపరిచాడు.

## పూర్తి సంతృప్తి పొందలేదు



గాంధీజీ స్టాంపులు, నాణేలు, కరెన్సీలను సేకరించడం కొంత సంతృప్తిని ఇచ్చింది. అయితే ఇంకా పూర్తిగా సంతృప్తి పొందలేదు. గాంధీజీ ఆటో బయోగ్రఫీ కోసం కృషిచేస్తున్నాను. అది సాధిస్తే మరింతగా సంతోషిస్తా. నేను గాంధీజీ బొమ్మలను సేకరించడం ద్వారానే చెడు అలవాట్లకు దూరంగా ఉంటున్నా. విద్యార్థులకు ఎగ్జిబిషన్‌లు ఏర్పాటుచేసి గాంధీజీ ఆశయాలను ప్రచారం చేస్తున్నా. అయితే ఉద్యోగరీత్యా పలుచోట్ల జరిగే ఎగ్జిబిషన్‌లకు తానే అన్ని వస్తువులను తీసుకెళ్లలేకపోతున్నా. ప్రభుత్వం స్పందించి ఇలాంటి ఎగ్జిబిషన్‌లను ఏర్పాటు చేయగలిగితే సులభంగా ఉంటుంది. విద్యార్థులు గాంధీ గురించి తెలుసుకునే అవకాశముంటుంది.

– రాజేష్